'పది' పరీక్షకు 27,531 మంది హాజరు

ప్రజాశక్తి-కడప అర్బన్

పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం పరీక్షల నిర్వహణ పకడ్బందీగా కొనసాగించారు. జిల్లాలోని 161 సెంటర్లలో రెగ్యులర్ విద్యార్థులు 27,671 మంది హాజరు కావాల్సి ఉండగా 27,531 మంది హాజరయ్యారు. 140 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు. ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు 10 మందికి గాను ఎనిమిది మంది హాజరయ్యారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను 13 మంది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 87 సెంటర్లను తనిఖీ చేశారు. డిఇఒ షంషుద్దీన్ నాలుగు సెంటర్లను పరిశీలించారు. జిల్లా పరిశీలకులు మధుసూదనరావు ఒక సెంటర్‌ను పరిశీలించారు.

నత్తనడకన ఆర్‌డిఎస్ఎస్ స్కీమ్!

సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు (ఫైల్ ఫోటో)

- రూ.463 కోట్లతో పనులకు శ్రీకారం
- కడప జిల్లాలో 29 శాతమే పూర్తి
- నెలాఖరుతో గడువు ముగింపు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఆర్‌డిఎస్ఎస్ (రీవ్యాప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ ఆఫ్ స్కీమ్) నత్తనడకన సాగుతోంది. కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధుల భాగస్వామ్యంతో గృహ, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల లోఓల్టేజీ సమస్య పరిష్కారం, నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలనే ఉద్దేశంతో ఎపి ట్రాన్స్‌కో చేపట్టింది. కడప జిల్లాలో రూ.463 కోట్లతో, అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల పరిధిలో రూ.409 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టింది. 2024 మార్చిలో టెండర్లు పిలిచింది. ఉమ్మడి కడప జిల్లాకు చెందిన కాంట్రాక్టు పనుల టెండరును షిర్డీ సాయి ఎలక్ట్రికల్ సంస్థ దక్కించుకుంది. టెండరు నిబంధనల ప్రకారం ఏడాది వ్యవధిలో గృహ, వ్యవసాయ సర్వీసుల ఫీడర్లను, లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను వేరు చేసి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడంలో విఫలమైంది.

జిల్లాలోని కడప, పులివెందుల, మైదుకూరు, ప్రొద్దుటూరు అసెంబ్లీ పరిధిలో 11కెవి 392 ఫీడర్లు ఉన్నాయి. కడప అసెంబ్లీ పరిధిలోని 65 ఫీడర్లలో 11 ఫీడర్లు, పులివెందుల పరిధిలో 95 ఫీడర్లలో 06, మైదుకూరు పరిధిలోని 148 ఫీడర్లలో 36, ప్రొద్దుటూరు పరిధిలోని 84 ఫీడర్లలో 05 ఫీడర్ల చొప్పున 58 ఫీడర్ల పనులు పూర్తి స్థాయి ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. మిగిలిన 198 ఫీడర్ల పనులు ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. 11కెవి లైన్లు 265 కిలోమీటర్లలో 1,033 కి.మీ, 3,639 ట్రాన్స్‌ఫార్మలో 453 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పూర్తి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కెవి.లైన్లు 38.98 శాతం, ట్రాన్స్‌ఫార్మర్స్ 12.45 శాతం పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి మరో 62.12 శాతం పనులు, ఫీడర్స్ కేటగిరీలో 70.69 శాతం పనులు, ట్రాన్స్‌ఫార్మర్స్ కేటగిరీలో 88.55 శాతం మేర పనులు పూర్తి చేయా ల్సి ఉంది.

అన్నమయ్య జిల్లాలో అంతంతే!

అన్నమయ్య జిల్లా రాజంపేట, రైల్వేకోడూరు అసెంబ్లీ పరిధిలో 232 11 కెవి ఫీడర్లలో 50 ఫీడర్లు మాత్రమే ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. మిగిలిన 112 ఫీడర్లను, 2,307 కి.మీ 11కెవి లైన్ నిర్మాణ పనుల్లో 454 కి.మీ మాత్రమే పూర్తి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. జిల్లా లోని 3,225 ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో 116 ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసింది. ఫీడర్లలో 44.64 శాతం, 11 కెవిలైన్ల ఏర్పాటులో 19.61 శాతం, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో 3.60 శాతం మాత్రమే పూర్తి చేసింది. మదనపల్లి, పీలేరు నియోజకవర్గాలకు చెందిన 245 కెవి ఫీడర్లలో 118 ఫీడర్లు పనులు నిర్మాణంలో ఉండగా, 32 ఫీడర్లు మాత్రమే పూర్తి చేసింది.

ఆది నుంచి అవాంతరాలే!

రాజకీయ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కాంట్రాక్టు సంస్థ ఆశించిన వేగం పెంచడంలో మీనమేషాలు లెక్కించింది. మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్ నుంచి సార్వత్రిక ఎన్నికల రాజకీయ వాతావరణం నేపథ్యంలో ఆశించిన మేరకు పనులు సాగలేదు. ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల విషయంలో నాన్పుడుధోరణి అవలంబించింది. రూ.215 కోట్ల మేరకు పనులు చేసింది. 29.29 శాతం పనులకు పరిమితం కావడం విస్మయాన్ని కలిగించింది.

గడువు పొడిగించేనా!

మార్చి నెలాఖరు నాటికి కాంట్రాక్టు గడువు ముగియనున్న నేపథ్యంలో కేంద్రం అందించే గ్రాంట్లు వడ్డీ ఖాతాలో జమ అవుతాయనే నిబంధన ఉన్న నేపథ్యంలో సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు మరోఏడాది పాటు నిధుల వినియోగం, కాంట్రాక్టు సంస్థకు గడువు పొడిగింపు ఇస్తుందా అనేది వేచి చూడా ల్సి ఉంది.

స్కీము పనుల్ని వేగవంతం చేస్తాం

ఆర్‌డిఎస్ఎస్ స్కీమ్ పనుల్ని వేగవంతం చేస్తాం. ఉత్తర భారతంలో హోళీ ముగిసింది. లేబర్ అందుబాటులోకి రానుంది. ఈ నెలాఖరు నాటికి 50 శాతం పనులు చేపడతాం. కాంట్రాక్టు గడువు పొడిగింపు అవకాశాల నేపథ్యం లో కాంట్రాక్టర్లు, సబ్‌కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశాలు నిర్వహించాం. స్వల్ప వ్యవధిలోనే స్కీమ్ పరుగులు పెడుతుందని భావిస్తున్నాం.

- ఎస్.రమణ, విద్యుత్ ఎస్ఇ, కడప.

ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టాలి : సిపిఎం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మనోహర్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వం కడప ఉక్కుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో నిధులు కేటాయించక పోవడం దారుణమని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్ అన్నారు. బుధవారం ఎన్‌జిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కుకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం నిలదీయకుండా కేంద్ర బడ్జెట్‌కు మద్దతు ఇచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కడప ఉక్కును రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించి నిర్మాణం చేపడుతుందని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు ఒక్క ఇటుక పేర్చలేదన్నారు. జిల్లా ప్రజానీకం కడప ఉక్కు నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభం అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. ఒకవైపు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారన్నారు. ఇక్కడ ఉక్కు పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. వెనుకబడిన రాయలసీమకు ఒకింత ఉపశమనం కడప ఉక్కు పరిశ్రమేనన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలలో కూడా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం చాలా తీవ్రమైన అన్యాయమని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం సొంత అధిక నిధులు కేటాయించి పరిశ్రమ నిర్మాణ ప్రారంభానికి చర్యలు చేపట్టాలని కోరారు. లేకుంటే కడప ఉక్కు కోసం ఆందోళన బాట తప్పదని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.ఏసుదాసు, పట్టణ కమిటీ సభ్యులు దాసరి విజయ్, ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

అప్పులబాధ తాళలేక రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఖాజీపేట

మండల పరిధిలోని బి.కొత్తపల్లె పంచాయతీ బక్కాయపల్లె గ్రామానికి చెందిన రైతు పత్తి రామచంద్రారెడ్డి(41) అప్పులబాధ తాళలేక పురుగుల మందు తాగి బుధవారం పొలంలో ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు పత్తి రామచంద్రారెడ్డి తన సొంత పొలం రెండున్నర ఎకరాతో పాటు ఐదు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. వరి, వివిధ రకాల పంటలను సాగుచేశారు. కొన్నేళ్లుగా పంటల దిగుబడి సరిగా రాకపోవడంతో పాటు, పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోయాయి. దిక్కు తోచక ఆత్మహత్యకు పాల్పడ్డారు. సుమారు రూ.15 లక్షల వరకు అప్పు ఉందని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. మక్మిృతుడు రామచంద్రారెడ్డికి భార్య శిరీషతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రభుత్వం స్పందించి మృతిని కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుచున్నారు. ఈ విషయమై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నారు.

పొలంలోనే ఆత్మహత్య చేసుకున్న రైతు రామచంద్రారెడ్డి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐ, నాయకులు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లా ప్రభుత్వ పెన్షన్ భవనంలో బుధవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ట్రాఫిక్ సిఐ జావిద్ హాజరయ్యారు. పెన్షనర్ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవగాహన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం సిఐ మాట్లాడుతూ ప్రతి ఒక్క తల్లిదండ్రులు వారి పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని కోరారు. చిన్న వయసులోనే వాహనాలు ఇస్తే ప్రమాదాలు సంభవిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా పెన్షన్ సంఘం నూనె నగేష్, సుబ్బరాయుడు, బాలయ్యరెడ్డి, వీరన్న, రాయుడు, టి.నారాయణ, నాగయ్య, నాగ మునీశ్వర్ రెడ్డి, రాయుడు పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఆదరణ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కిరణ్ మోహన్‌రావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు కులవృత్తులకు, కళాకారులకు ఎంపిడిఒ కార్యాలయంలోని సభా భవనంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారికి పనిముట్లు అందజేస్తామన్నారు. కులవృత్తులు చేసుకునేవారు ఈ సమావేశంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

పనులను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి కడప అర్బన్

నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి మార్నింగ్ విజిట్ భాగంగా బుధవారం మారుతినగర్, సెవెన్ రోడ్స్, కోపరేటివ్ కాలనీ ప్రాంతాలను శానిటేషన్ విభాగ అధికారులతో కలిసి పారిశుధ్య పనులను పరిశీలించారు. పాత రిమ్స్, మున్సిపల్ స్థలం టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, ఇంజినీరింగ్ విభాగ అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడ చేయవలసిన పనుల గురించి చర్చించారు. జిల్లా పరిషత్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు.

కుల మతాలకు అతీతంగా ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-కడప అర్బన్

రంజాన్ మాసం ప్రారంభం నుంచి కుల మతాలకు అతీతంగా ఎన్నారై విభాగం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహిస్తూ ఉన్నామని టిడిపి ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు షేక్ రహమతుల్లా పేర్కొన్నారు. బుధవారం మార్కెట్ యార్డ్ సమీపంలో ఉన్న ఎన్ఆర్ఐ కువైట్ కార్యాలయంలో రంజాన్ ఇఫ్తార్ విందును పంపిణీ చేశారు. నగరంలోని పలు పేదల కాలనీలో కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తూ ఉన్నామని పేర్కొన్నారు. పేదవాడి ఆకలి ఎలా ఉంటుందో తెలిపేందుకే ఉపవాసాలను పెద్దలు ఏర్పాటు చేశారని చెప్పారు. పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇఫ్తార్ విందును బాక్సుల్లో పంపిణీ చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాసాపేట శివ, జిల్లా ఉపాధ్యక్షులు ఏటూరి లోకేష్, టిడిపి నాయకులు శేఖర్, నరసింహారెడ్డి, విశ్వనాథ్, ఇర్ఫాన్, అబ్దుల్లా, అమీన్, ఫజ్జు, అబ్బుబకేర్, ఆర్షద్, సీజద్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పంపిణీ చేస్తున్న రహమతుల్లా

రైతులను గాలికొదిలేసిన ప్రభుత్వం : వైసిపి

మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి-కడప

కరువు వల్ల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, రైతులను ప్రభుత్వం ఏమాత్రం ఆదుకోకుండా గాలికొదిలేసిందని వైసిపి జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో రైతులకు మద్దతు ధర లేదన్నారు. విత్తనాల సరఫరా కూడా లేదన్నారు. బడ్జెట్‌లో రైతులకు కేటాయింపులే అరకొరేనని తెలిపారు. విజనరీ అని చెప్పుకోవడం తప్ప చంద్రబాబుకు విజన్ అంటూ లేదన్నారు. అన్నదాత సుఖీభవ అన్నాడు తప్ప ఏడాది గడిచినా రైతుకు రూ.20 వేలు ఇవ్వలేదన్నారు. పంట ఉత్పత్తులను కొనుగోలు చేయకుండా రైతులను ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి మోసం చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడ లేదన్నారు. శనగ పంట దిగుబడి సగమే వచ్చింది..దానికీ మద్దతు ధర లేదని తెలిపారు. గతంలో చంద్రబాబు పెట్టిన బీమా బకాయిలను జగన్ చెల్లించారని గుర్తుచేశారు. సమావేశంలో జడ్‌పి వైస్ చైర్మన్ బాలయ్య, వైసిపి నాయకులు పులి సునీల్‌కుమార్, నాగేంద్రారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఇలియాస్, నాగేంద్ర, మునిశేఖర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణాలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం : టిడిపి

ప్రజాశక్తి-కాశినాయన

మండల పరిధిలోని కాశీనాయన జ్యోతి క్షేత్ర ఆలయ నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జ్యోతి క్షేత్రాన్ని సందర్శించారు. మొదటగా కూలదోసిన కొన్ని సత్రాలు, స్నానపు గదులు, తలనీలాలు తీసే గది, గోశాలను పరిశీలించారు అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిరంతరం అన్నదానం చేసే జ్యోతి క్షేత్రంలో ఇలాంటివి చేయటం దురదృష్టకరమని పేర్కొన్నారు వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్ తన సొంత నిధులతో నిర్మాణాలు చేపడతానని మాట ఇచ్చి 24 గంటలు గడవకముందే పనులు చేపట్టారని చెప్పారు. పనులు పూర్తయ్యే దిశలో ఉన్నాయని తెలిపారు. వైసిపి పరిపాలనలో జ్యోతి క్షేత్రం గురించి ఏమాత్రం పర్మిషన్ కోసం ప్రయత్నించలేదని ప్రశ్నించారు. వైసిపి నాయ కులు బురద చల్లడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి యువ నాయకుడు చెరుకూరి రవి, బిజెపి, జనసేన నాయకులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణారెడ్డి

దూరవిద్య కోర్సుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్సిటీ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ ద్వారా పలు కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మతో కలిసి మాట్లాడుతూ వైవీయూ గుర్తింపునిచ్చిన అధ్యయన కేంద్రాల్లో ఎంఎ ఎకనామిక్స్, ఇంగ్లీష్, హిస్టరీ, జర్నలిజం, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, తెలుగు, ఎంకామ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. బ్యాచిలర్ డిగ్రీలో ఎకనామిక్స్ చదివిన వారికి మాత్రమే ఎంఎ ఎకనామిక్స్‌లో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. బీకాం, బిబిఎ, బిబిఎం డిగ్రీ చేసిన వారు మాత్రమే ఎంకామ్‌లో ప్రవేశాలకు అర్హులన్నారు. మిగిలిన అన్ని కోర్సులకు ఎదేని డిగ్రీ పాసైతే చాలన్నారు. ఈ ఏడాది నూతనంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైనార్ట్స్ మ్యూజిక్ నాలుగేళ్ల డిగ్రీ కోర్సును ప్రారంభించామన్నారు. ఈ కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్, సమాన అర్హత గల వారు ప్రవేశానికి అర్హులన్నారు. సర్టిఫికెట్ అండ్ డిప్లమా కోర్సులలో సైకాలజీ– కౌన్సిలింగ్ అండ్ గైడెన్స్, లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్, ట్రావెల్ అండ్ టూరిజం మేనేజ్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్, బిగ్ డేటా అనాలసిస్ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో ప్రవేశం పొందవచ్చు అని తెలిపారు. ఈ కోర్సులన్నీ డిస్టెన్స్, ఆన్‌లైన్ లర్నింగ్ విధానంలో ఉంటాయన్నారు. వివరాలకు https://code.yvu.edu.inను సంప్రదించాలని సూచించారు.

ఎఎస్‌డబ్ల్యూఒపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప : జమ్మలమడుగు ఎఎస్‌డబ్ల్యూఒ గురుప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు గురుసాయిదత్త డిమాండ్ చేశారు. బుధవారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎఎస్‌డబ్ల్యూఒపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు గురుప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

జూనియర్ డాక్టర్ల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-కడప సిటీ : ప్రభుత్వ వైద్య కళాశాల జూనియర్ డాక్టర్ల సంఘం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా డాక్టర్ ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాక్టర్ బి.విజయ్, డాక్టర్ చరిత, డాక్టర్ పూజ, డాక్టర్ ప్రతిభ, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఎ.నిఖిల్ సింగ్, డాక్టర్ సుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. అనంతరం కళాశాలలోని సమస్యల గురించి వినతిపత్రం సమర్పించారు. వారు కళాశాల సమస్యల గురించి ప్రస్తావించారు. ప్రిన్సిపల్ డాక్టర్ సురేఖ సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేసి జూడా అసోసియేషన్ సభ్యులకు తెలియజేస్తామని చెప్పారు. నూతనంగా ఎన్నికైన వారిని ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై.విజయభాస్కర్‌రెడ్డి అభినందించారు.

జూనియర్ డాక్టర్లను అభినందిస్తున్న ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్

మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

దృష్టిలోపం ఉన్నవారు బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. బుధవారం జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం శంకరాపురం నందుగల ప్రభుత్వ అందుల పాఠశాలలో 'దృష్టిలోపం ఉన్నవారి ప్రయోజనం కోసం ప్రాంతీయ భాషలో బ్రెయిలీ సాధనాలు మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్నవారు బ్రెయిలీ రూల్స్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రాంతీయ భాషా బ్రెయిలీ సాధనాలు దృష్టి లోపం ఉన్నవారికి సహాయపడతాయి, సుకన్య పుస్తకాలయ అనేది ద ృష్టిలోపాలు మరియు ఇతర ప్రింట్ వైకల్యాలు ఉన్న వ్యక్తుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ లైబ్రరీ అని పేర్కొన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లీస్ రీడింగ్ మెటీరియల్, స్క్రీన్ రీడర్లు, బ్రెయిలీ డిస్ప్లే, ఆడియో ఫార్మేట్లు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, నల్సా పథకములు మొదలగు అంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు మరియు వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆర్.వి.కృష్ణకిషోర్, మండల విద్యా శాఖాధికారి ఇర్షాద్ అహ్మద్, అంధుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెబనైజర్, ఉపాధ్యాయులు రాజ, నరసింహులు, ప్రత్యేక పిల్లలు పాల్గొన్నారు.

జడ్‌పి చైర్మన్ ఎన్నికపై వైసిపి నాయకుల సమీక్ష

ప్రజాశక్తి - కడప

ఈ నెల 27వ తేదీన జరగబోవు జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నిక గురించి వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో బుధవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జడ్పీ ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలో చర్చించి తగు సూచనలు చేశారు. ఈ సమావేశానికి అన్నమయ్య జిల్లా పార్టీ అధ్యక్షుడు అమర్నాథ్‌రెడ్డి, మైదుకూరు, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, నాయకులు హాజరయ్యారు.

డిగ్రీలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరంలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శ్రీహరి డిగ్రీ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యా బోధన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజోమూర్తి, అర్చన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మదనమోహన్‌రెడ్డి, సిఎన్ఆర్ డిగ్రీ కాలేజీ పీలేరు విజయ్ భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రత్యేక అతిథిగా కళాశాల పూర్వపు విద్యార్థి, గ్రూప్ వన్ ఆఫీసర్ చందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరంలోనే తన లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారని పేర్కొన్నారు. డాక్టర్ కావలసన తాను కొన్ని కారణాల వల్ల గ్రూప్-1 ఆఫీసర్ అయ్యారని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, విజయభారతి తనకు ధైర్యాన్ని ఇచ్చారని తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ప్రయత్నించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తేజ మూర్తిని సన్మానిస్తున్న యాజమాన్యం, వివిధ కళాశాలల కరస్పాండెంట్లు

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ఎపిజిబి ప్రధాన కార్యాలయ తరలింపు ఆపండి

- పార్లమెంట్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడప నుంచి అమరావతికి తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, ఈ ప్రక్రియను ఆపాలని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి పార్లమెంటులో కోరారు. 2006లో కడప కేంద్రంగా ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేశారన్నారు. 550 బ్రాంచిల్లో రూ.4,600 కోట్ల మేర లావాదేవీల జరుగుతున్నాయని, ఈ కార్యాలయం పరిధిలో 3,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని వివరించారు. వైఎసఆర్, అన్నమయ్య, అంతపురం, సత్యసాయి, కర్నూల్, నంద్యాల, నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, తిరుపతి 10 జిల్లాలకు అనుకూలంగా ఉందన్నారు. దీన్ని అమరావతికి తరలించడం వల్ల రాయలసీమ జిల్లాల వారికి దూరం పెరుగుతుందన్నారు. కడప కేంద్రంగా కార్యాలయం ఉండడం వల్ల అన్ని జిల్లాలకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. తరలింపును ఆపేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు.

బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న తులసిరెడ్డి

ఆర్‌టిసి బస్టాండును వెంటనే ప్రారంభించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె ఆర్‌టిసి బస్టాండును వెంటనే ప్రారంభించాలని పిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం బస్టాండు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో దాదాపు 40 వేల జనాభా ఉందన్నారు. చక్రాయపేట, వేముల, వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాలకు వేంపల్లె కూడలిగా ఉందన్నారు. వేంపల్లె బస్టాండు నిత్యం ప్రయాణికులతో కిట కిటలాడుతుందన్నారు. గతంలో ఉన్న పాత బస్టాండును ప్రభుత్వం కూల్చి, దాని స్థానంలో రూ.2కోట్ల 30 లక్షలతో కొత్త బస్టాండును నిర్మించిందన్నారు. నిర్మాణం పూర్తయి 5 నెలలు కావస్తోందన్నారు. బస్టాండు ప్రారభించకపోవడంతో బాత్రూంలను కూడా తెరవక ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్టాండ్ ప్రారంభ విషయమై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లా డినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పులివెందుల నియోజకవర్గం సమ న్వయకర్త మూలంరెడ్డి ధృవకుమార్ రెడ్డి, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు సుబ్ర మణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, పులివెందుల మండల శాఖ అధ్యక్షుడు తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి, చక్రయపేట మండల శాఖ అధ్య క్షుడు మూలంరెడ్డి రామాంజనేయులురెడ్డి, వేముల మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్నకేశవ, అమర్నాథ్‌రెడ్డి, రవి, ఉత్తన్న, చందు, సాయి, వినయ్, రాజు, బద్రి, రమణ, ప్రయాణికులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

ఎస్‌సి వర్గీకరణ రద్దు కోరుతూ నిరసన

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్‌సి వర్గీకరణ రద్దు కోరుతూ రాష్ట్ర మాల మహానాడు ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో ఎస్‌సి వర్గీకరణ రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర మాల మహానాడు రామోజీ గ్రూప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం దళితుల మధ్య చిచ్చు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజలకు చెప్పిన సూపర్‌సిక్స్ పథకాలు, శాంతిభద్రతల పరిరక్షణపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మాల మహానాడు మండల అధ్యక్షుడు శిఖామణి, ఓబయ్య శోభన్‌బాబు, రమణ, రాజేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కడప రోడ్డులోని మై హోమ్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. పెట్రోల్ ట్యాంక్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో పెట్రోల్ ట్యాంకర్ క్యాబిన్‌లో ఉన్న డ్రైవరు ఖాదరయ్య (41) అక్కడికక్కడే మృతి చెందాడు. ట్యాంకర్ క్యాబిన్ మొత్తం దెబ్బతింది. క్యాబిన్‌లో ఇరుక్కున్న మృతదేహాన్ని పోలీసులు బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఖాదరయ్య సత్యసాయి జిల్లా ఎస్పీ గుంట గ్రామానికి చెందిన వ్యక్తి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొనడంతో ముందుభాగం దెబ్బతిన్న ట్యాంకర్

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

నిరుపయోగంగా ఉన్న వ్యవసాయాధికారి కార్యాలయం

ప్రజాశక్తి - లింగాల

అధికారులు విధులు నిర్వహించేందుకు నిర్మించిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కొన్నేళ్ల క్రితం మండల కేంద్రంలో నిర్మించిన పశువైద్యశాల, వ్యవసాయ కార్యాలయం కూలిపోయే దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా కార్యాలయాల్లో అధికారులు విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. నెర్రలు చీలిన గోడలు, దెబ్బతిన్న కిటికీలు, పెచ్చులూడిన స్లాబ్ తదితర సమస్యల నడుమ భయం భయంగా అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. వర్షానికి ఉరుస్తున్నా.. ఎప్పుడు కూలుతుందోననే భయంతో పనిచేయలేక కిందిస్థాయి సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ కూడా కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదనే విమర్శలున్నాయి. దాదాపు 35 ఏళ్ల క్రితం నిర్మించిన పశువైద్యశాల భవనం ప్రస్తుతం కూలేందుకు సిద్ధంగా ఉంది. నెర్రలు చీలిన భవనం నిత్యం పశువైద్యాధికారి, సిబ్బంది విధులను నిర్వహిస్తున్నారు. మందులు, రికార్డులకు వర్షాకాలంలో భద్రత లేకుండా ఉంది. ఉన్నతాధికారులు స్పందించి కొత్త భవనాన్ని నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నూతన భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు కాలేదు. నూతన భవనం నిర్మిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో నిత్యం రైతులకు రాయితీపై అందించే విత్తనాలు, ఎరువులు ఆ కార్యాలయంలో పంపిణీ చేస్తారు. ఏడాది నుంచి వ్యవసాయధికారి కార్యాలయంలో విధులు నిర్వహించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కిటికీలు, తలుపులు, గోడలు, చప్పట కుంగిపోయి నెర్రలు చీలి ఉన్నాయి. ఏ క్షణంలో ఏమి జరుగుతుందోనని అధికారులు, సిబ్బంది భయాందోళనలో ఉంటున్నారు. కిందిస్థాయి సిబ్బంది రైతు సేవా భవనంలో విధులను నిర్వహిస్తున్నారు. అదీ కూడా అద్దె భవనం కావడంతో సౌకర్యాలు లేవు. వ్యవసాయాధికారి కార్యాలయాన్ని కొత్తగా నిర్మించాలని అధికారులు, సిబ్బంది, రైతులు కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న పశువైద్యశాల

ఆ.. కిచకిచలకు గూడు కడదాం..!

- నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చల్లని ఉషోదయం పలకరిస్తున్న వేళ.. పచ్చని చెట్ల నుంచి పిచ్చుకలు ఇతర పక్షులు చేసే కిలకిల రావాలు ఒక శ్రావ్యమైన సంగీతంతో పరవశింపజేస్తాయి. ఇంటి గుమ్మం ముందు చల్లిన గింజల కోసం కిచకిచమంటూ వాలి ఆ గింజలు తిని తుర్రుమని ఎగిరిపోవడాన్ని చూస్తే కలిగే ఆనందమే వేరు. ఇంట్లో ఎక్కడో అటక మీద చిన్న గూడు కట్టుకొని బుర్రుమంటూ అటుఇటు తిరుగుతూ ఉంటే ఆ ఇంట్లో ప్రశాంతత ఉన్నట్లే. అన్నం తినకుండా పిల్లలు మారాం చేస్తే బయటికి వెళ్లి చెట్టు మీదున్న పక్షులను చూపిస్తూ అమ్మ గోరు ముద్దలు తినిపిస్తుంటే ఆ సుఖమే వేరు. ఒకనాడు పంట చేలల్లో, ఇంటి ముంగిళ్లలో, ధాన్యపు రాశుల్లో కిలకిలమంటూ సందడి చేసే పిచ్చుకలు నేడు పూర్తిగా కనుమరుగవుతున్నాయి. విస్తరిస్తున్న నగర సంస్కృతి.. తరిగిపోతున్న అడవులు వాటి స్థానంలో కాంక్రీట్ జంగిల్ తయారవుతోంది. పెరిగిపోతున్న టెక్నాలజీ కారణంగా రేడియేషన్, కర్మాగారాల కాలుష్యం, కృత్రిమ ఎరువుల వాడకం ఫలితంగా పిచ్చుకలు కనుమరుగవుతున్నాయి. కడుపు నింపుకునేందుకు గింజలు లేక ఉండేందుకు సరైన నీడ దొరక్క పిట్టలు రాలిపోతున్నాయి. పక్షుల పిల్లలకు రెక్కలు వచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటాయి మనుషుల కన్నా ఎక్కువగా అన్యోన్యతను కనబరుస్తాయి. పిచ్చుకలు నశిస్తే మానవాళి మనుగడ కూడా ప్రశ్నార్థకమే. పొద్దున్నే పిచ్చుకల కిచకిచ రావాలు వింటూ ఆనందంగా కళ్లు తెరిచే క్షణాలు కనుమరుగుతున్నాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించిన లినేచర్ ఫర్ ఎవర్ సొసైటీ ఆఫ్ ఇండియా వారు ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని జరుపుతారు. పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల బాధ్యత ఎంతో గొప్పది. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనాకు గబ్బిలమే కారణం. పక్షులను రక్షించడం అంటే మనల్ని మనం కాపాడుకోవడమే. మనసు ప్రశాంతతను చేకూర్చే పక్షుల కిలకిల రావాల కోసం భవిష్యత్ తరాలు ఎదురు చూస్తున్నాయి.

పక్షుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..

పిచ్చుకల రక్షణకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. ఇవి గుప్పెడు గింజలు తింటూ మనకు హాని కలిగించే పలు రకాల క్రిమి కీటకాలను నాశనం చేస్తాయి. పొలాల్లో తిరగడం వల్ల క్రిమి కీటకాలు నాశనమై పంటలు బాగా చేతికి వస్తాయి. వీటి కిలకిల రావాలు మనలో మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయి. మనుషుల ప్రాణాల్లాగే పక్షుల ప్రాణాలు కూడా లివన్ హెల్త్ కాన్సెప్ట్‌ని చిత్తశుద్ధితో అమలు పరచాలి. పిచ్చుకలు రైతులతోపాటు మనందరికీ మంచి నేస్తాలు. కంకి గుర్తులను వసారాలో వేలాడదీసి పిచ్చుకలకు ఆహారాన్ని అందించే దృశ్యాలను గతంలో చూశాం. నీటి సౌకర్యం కల్పించేవారు. ఇలాంటి దృశ్యాలు మళ్లీ మన కళ్ల ఎదుట ఆవిష్కృతం అవ్వాలి. **- డాక్టర్ పి.రేవతి.అసిస్టెంట్, ప్రొఫెసర్. ప్రభుత్వ పశువైద్య కళాశాల, ప్రొద్దుటూరు**

కార్మికులకు న్యాయం చేయాలి

మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ సెక్షన్ కార్మికులకు న్యాయం చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.విజయ్ కుమార్, జమ్మలమడుగు సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి విజయ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడుతూ 20ఏళ్ల నుంచి తక్కువ వేతనాలతో పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర కూటమి ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమైన చట్టాలు చేసి, దళారీ వ్యవస్థను తెస్తోందన్నారు. దళారుల పరిస్థితి ఎలా ఉందంటే.. రోడ్డెక్కి ధర్నాలు చేస్తే తప్ప అయిదారు నెలలకు జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు. అనేక అవస్థలు పడి ఉద్యమాలు చేస్తే తప్ప, ప్రభుత్వాలు జీతాలు పెంచిన పరిస్థితి లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, ఇంజినీర్ సెక్షన్ కార్మికులు దాదాపు 45 వేల మంది ఉన్నారన్నారు. వీరిని పర్మినెంట్ చేస్తామనిగత ప్రభుత్వం చెప్పి మాట తప్పిందన్నారు. తక్షణమే ఆప్కాస్‌ను రద్దు చేయండి అభ్యంతరం లేదన్నారు. పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏప్రిల్9న మున్సిపల్ పట్టణ మహాసభలను నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు బి.నాగన్న. మున్సిపల్ యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

చేతి వృత్తుల అభ్యున్నతికి 'ఆదరణ'

ప్రజాశక్తి - ముద్దనూరు

చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల అభ్యున్నతికి ఆదరణగా ప్రభుత్వం పరికరాలు అందిస్తుందని ఎంపిడిఒ ముకుందరెడ్డి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సభా భవనంలో బుధవారం ఎంపిడిఒ ముకుందరెడ్డి ఆధ్వర్యంలో ఆదరణ పథకం-3 గురించి అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో బిసి వర్గానికి చెందిన చేతి వృత్తుల మహిళలు, పురుషులు భారీగా హాజరయ్యారు. ఈఓఆర్డి వీరభద్రుడు, పరిపాలనాధికారి పరిపూర్ణ అరుంధతి, సిబ్బంది పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఆదరణ-3 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ సయ్యద్ ఉన్నిషా సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభ భవనంలో బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె ప్రభుత్వం చేపట్టబోతున్న ఆదరణ-3 పథకానికి సంబం ధించి అవగాహన కల్పించారు. బిసి కులాలకు చెందిన కుల, చేతి వృత్తుల వివరాలు, ఆధునిక పరికరాల కోసం వృత్తుల వారీగా పేర్లు ఇవ్వాలన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణా తరగతులను మైదుకూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అందిస్తామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి.సుబ్బారావు తెలిపారు. పదవ తరగతి తర్వాత పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం పాలిసెట్-2024 పరీక్షను ఏప్రిల్ 30న రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ మండలి నిర్వహిస్తుందని తెలిపారు. హాజరయ్యే విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఉచి తంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యా ర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాలి సెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15 వరకు గడువు ఉందన్నారు. విద్యార్థులు తమ పదవ తరగతి హాల్ టికెట్, ఆధార్ కార్డు, తమ మొబైల్ ఫోన్, ఓసి, బిసి అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 రుసుంతో సమీ పంలోని పాలిటెక్నిక్ కళాశాలను సంప్రదించి దర ఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల రైతులకు లాభదాయకమని ఎఒ నాగలక్ష్మి సూచించారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో పులివెందుల రైతు ఉత్పత్తిదారుల సం ఘం ఆధ్వర్యంలో బుధవారం పెద్ద రంగాపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను వివరించారు. **చాపాడు :** బద్రిపల్లెలో ఎఒ మ్యాగీ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతు భూ ఆధార్ కార్డు తప్పక పొందాలన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో నమోదు చేసుకొని, తద్వారా అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ మొదలగు పథకాలు పొందవచ్చన్నారు. క్షేత్ర సందర్శనలో భాగాం గా మినుము పొలాన్ని సందర్శించారు. విఎఎ సురేష్, జడ్బీ ఎన్ఎఫ్ సిబ్బంది మాహేష్, వెంకటేశ్వర రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఒలంపియాడ్‌లో నలంద విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జాతీయస్థాయి మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో నలంద పాఠశాల విద్యార్థులు 15 మంది బంగారు పథకాలు సాధించారని కరస్పాండెంట్ బి.సోమేశ్వరరెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తిని పెంపొం దించుకుంటారని తెలిపారు. వైస్ ప్రిన్సిపల్ సి.విజిత, ప్రధానోపాధ్యాయుడు ఇ.సర్వేశ్వర్‌రెడ్డి, గణితం ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి ఎం ధృవకుమార్‌రెడ్డి, మండల శాఖ అధ్యఓఉలు తుమ్మలూరు అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ కార్యా లయంలో బుధవారం తహశీల్దార్ నజీర్ అహ్మద్‌ను కలిశారు. పలు ప్రజా సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహశీల్దార్‌ను సత్కరించారు

అంధుల ఆశ్రమంలో దుస్తులు వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక కచేరి రోడ్డు శ్రీ వీర అంధుల ఆశ్రమంలో బుధవారం అన్నారెడ్డి రాణా ప్రతాప్‌రెడ్డి 8వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన సతీమణి వసుంధర, కుమార్తెలు చరిత, తేజశ్వేత, మనుమళ్లు, మనుమరాళ్లు దుస్తులు పంపిణీ చేశారు. అన్నారెడ్డి సుధాకర్ రెడ్డి, రిటైర్డ్ తహశీల్దార్ ప్రభాకర్‌రెడ్డి, ఆశ్రమం నిర్వాహకులు అనిమెల రామమోహన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి, సమస్య పరిష్కారానికి చొరవ

ఖాజీపేట : పంచాయతీల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతామని మండల గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘం పేర్కొంది. పంచాయతీ కార్యదర్శుల సంఘం గ్రేడు 1-6 నూతన కార్యవర్గం బుధవారం ఏకగ్రీవంగా జరి గింది. అధ్యక్షులుగా పి.శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షులుగా ఎంవి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా సుదర్శన్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షు రాలుగా సుగుణ, కోశాధికారిగా శ్రీనాథ్‌రెడ్డి, జనరల్ సెక్రెటరీగా పుల్లయ్య యాదవ్, అదనపు సెక్రెటరీలుగా తులసి కుమార్‌రెడ్డి, లక్ష్మీ ప్రసన్న, గౌరవ సలహాదారులుగా రజాక్, రాజశేఖర్‌రెడ్డి శ్రీనివాసులు, రియాజ్ అహ్మద్, కార్యనిర్వాహక సభ్యులుగా భాగ్యశ్రీ, హరికుమార్, శివకుమార్, విక్టర్ ప్రేమ్ సాగర్, ప్రణీత్ కుమార్‌రెడ్డి, కల్యాణి ఎన్నికయ్యారు. అనంతరం ఎంపిడిఒ వెంకట రమణను కలిసి అభినందనలు అందుకున్నారు.

ఎంపిడిఒతో పంచాయతీ కార్యదర్శుల కమిటీ

మాట్లాడుతున్న సత్యనారాయణ

కడప ఉక్కుపై 26న ప్రొద్దుటూరులో సదస్సు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప ఉక్కు..ఆంధ్రుల హక్కు దీనిపై ఈనెల 26న ప్రొద్దుటూరు ఎన్‌జిఒ హోంలో సదస్సు ఏర్పాటు చేసినట్లు సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. ప్రొద్దుటూరు ప్రజలు, వ్యాపారులు, నిరుద్యోగులు సదస్సును జయప్రదం చేయాలని కోరారు. రాష్ట్ర విభజన సందర్భంగా కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని అధికారంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ విభజన చట్టం షెడ్యూల్ 13లో పొందుపరిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బిజెపి స్టీల్‌ప్లాంట్ గురించి మాట్లాడిన పాపాన పోలేదని తీవ్రంగా విమర్శించారు. టిడిపి, వైసిపి ప్రభుత్వాలు స్టీల్‌ప్లాంట్‌ను శిలాఫలకాలికే పరిమితం చేశాయని విమర్శించారు. ఓట్లు దండుకున్నారే తప్ప.. ప్రజల గురించి ఆలోచన చేయలేదన్నారు. సమావేశంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, శేఖర్ పాల్గొన్నారు.

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చాపాడు

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అదనపు ఆర్థికసాయం అందించనుందని హౌసింగ్ ఎఇ ప్రమోద్ కుమార తెలిపారు. ఏప్రిల్ 20లోపు గృహ నిర్మాణం పూర్తి చేసుకునే ఎస్‌సి, ఎస్‌టి, బిసి లబ్ధిదారులకు ప్రభుత్వం ఈ అవకాశం కల్పించిందన్నారు. మండలంలో బిపిఎల్-20, పిబి-5, బిఎల్-56, ఆర్ఎల్-33, ఆర్‌సి-14 గృహాలున్నాయన్నారు. బిసి, ఎస్‌సిలకు రూ.50వేలు, ఎస్‌టిలకు రూ.75వేలు ఇవ్వనున్నారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు ఉపయోగించుకోవాలని ఎఇ కోరారు.

గండి దేవస్థాన ముఖచిత్రం

చైర్మన్ పదవి చక్రాయపేట వాసులకే ఇవ్వాలి..!

- మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లిన నాయకులు

ప్రజాశక్తి - చక్రాయపేట

గండిక్షేత్రం శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ పదవిని చక్రాయపేట మండల వాసులకే ఇవ్వాలని అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. గండిక్షేత్రం మండలంలోని మారెళ్లమడక గ్రామ పంచాయతీలో ఉంది. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికార పార్టీ నాయకులు చక్రాయపేట మండల వాసులకు మాట ఇచ్చినప్పటికీ వేంపల్లె మండలం వీరన్నగట్టుపల్లెకు చెందిన ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకటస్వామి పేరు ప్రకటించడం ఏమిటని పలువురు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న వైసిపికి చెందిన ఆలయ కమిటీ చైర్మన్ కావలి కృష్ణతేజ తన పదవీకాలం పూర్తయ్యేవరకూ రాజీనామా చేయబోనని అంటున్నారు. ఈ నేపథ్యంలో నూతన కమిటీ ఎన్నిక జరగలేదు. ఆలయ కమిటీ చైర్మన్ ఎన్నిక జరిగితే చక్రాయపేట మండలంలోని ఏ గ్రామానికి చెందిన వారైనా, ఏ సామాజిక వర్గానికి చెందిన వారైనా అభ్యంతరం లేదన్నట్లు తెలుస్తోంది. గతంలో లక్కిరెడ్డిపల్లె నియోజక వర్గంలో ఉన్నప్పుడు గండి క్షేత్రం చైర్మన్ పదవి చక్రాయపేట మండల వాసు లకే అధిక ప్రాధాన్యత ఉండేది. ప్రతిసారి గండి క్షేత్రం చైర్మన్ పదవి వేంపల్లి మండల వాసులకు దక్కడం ఏ మాత్రం సమంజసం కాదని పలువురు పేర్కొంటున్నారు.

ఇళ్లకు అదనపు లోడు క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఇళ్లకు అదనపు లోడు క్రమబద్ధీకరణ నిమిత్తం 50 శాతం రాయితీతో వినియోగదారులకు విద్యుత్ సంస్థ సువర్ణ అవకాశాన్ని కల్పించిందని ఆ శాఖ ఎఇ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ ఛార్జీలు గతంలో రూ.2 వేలు ఉండగా.. ప్రస్తుతం 50 శాతం రాయితీ పోనూ వినియోగదారులు రూ వెయ్యి మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఈ అవకాశం జూన్ 30 వరకు మాత్రమే ఉందన్నారు. ఆన్‌లైన్‌లో చెల్లించడానికి గూగుల్‌లో ఏపీ ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే మనకు వాలంటరీ అడిషనల్ లోడ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి అదనపు లోడ్‌ను సులభంగా చెల్లించవచ్చన్నారు. ఏపీ ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లోగానీ విద్యుత్ ఉపకేంద్రంలోని అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌లో మార్పు ఉండదన్నారు. కిలోవాట్‌కు రూ.200 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

కెజిబివిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - చాపాడు

కస్తూరిబా బాలికల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికిగానూ 6వ తరగతి, ఇంటర్ మెదటి సంవత్సరం ప్రవేశానికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనాథలు, బడిబయట ఉన్న పిల్లలు, బడి మానేసిన వారు, పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసి మైనారిటీ, బిపిఎల్ కుటుంబాల బాలికలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. వెబ్‌సైట్‌లో విద్యార్థినులు దరఖాస్తు చేసుకుంటే వారి మొబైల్‌కు మెసేజ్ వస్తుందన్నారు. విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ, కులధృవీకరణ పత్రాలు, పూర్వ పాఠశాల తరగతి వివరాలు, విద్యార్థిని పాస్ పోర్టు సైజు ఫొటో అందజేయాలన్నారు.

రాజీవ్‌నగర్‌కు ట్యాంకర్‌తో నీటి సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో నీటి ఎద్దడి ఉండడంతో ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేశారు. బుధవారం ప్రజల విన్నపం మేరకు టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ ఆధ్వర్యంలో నీటిని సరఫరా చేశారు. ప్రతి రోజూ తాగునీరు సరఫరా కాకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భూగర్భ జలాలు అడుగంటి బోర్లల్లో నీటి శాతం తగ్గిపోయింది. ఈనేపథ్యంలో ప్రతి రోజూ ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తామని టిడిపి నేత మహమ్మద్ షబ్బీర్ తెలిపారు. ఇందుకు ఆప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మహమ్మద్, బుజ్జి, బాబు, వెల్డింగ్ బాషా, జమాల్ వలి, సురేంద్ర, హుసేన్ పాల్గొన్నారు.

ట్యాంకర్ వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు